క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వారి స్వగృహానికి ఇటీవల విచ్చేసిన గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతికి ఘన నివాళి



సింహాచలం మాస్టర్ పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాజన్నదొర

మక్కువ: మండలంలోని కవిరిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు పెంట సింహాచలం(80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు గ్రామానికి చేరుకొని, సింహాచలం మాస్టార్ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాల్యదశలో విద్యాబుద్ధులు నేర్పిన గురువు సింహాచలం మృతి చెండటంతో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ఒకింత ఆవేదనకు గురయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ, అలాగే ఎల్ఈరోపేట ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న నిర్వహణ పనుల నేపథ్యంలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బందలుప్పి, జమదాల, వీరభద్రాపురం, అంటివలస, పులిగుమ్మి, తాళ్లబురిడి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏఈ పి.రామారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్య శిబిరం సందర్శన



రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని రోగులు వినియోగించుకోవాలని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. పెదంకలాం పీహెచ్‌సీలో డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన వైద్య బృందంతో కలిసి పరిశీలించారు. ముందుగా శిబిరానికి వచ్చిన రోగులను ఎటువంటి వ్యాధులతో వచ్చారు... వైద్య సేవలు ఎలా అందిస్తున్నారో.. అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ వైద్యులు డాక్టర్ కౌషిక్, డాక్టర్ నిహారిక, డాక్టర్ సిగ్ధ, టి.హేమాక్షి, డాక్టర్ పావని, ఎంపీహెచ్‌ఈవో జి.సూర్యనారాయణ, స్థానిక హెల్త్ సూపర్‌వైజర్లు సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు



పీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించని ఎడల సమ్మెబాట చేపట్టక తప్పదని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను అతని కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించడం, ప్రమోషన్లు కల్పించడం, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ట్రైబల్ అలవెన్సు మంజూరు చేయాలన్నారు. అలాగే చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాంలో పాల్గొనే వైద్యులకు రూ.5 వేల అలవెన్సులు చెల్లించాలన్నారు. కచ్చితమైన పనిగంటలు, వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భానుప్రతాప్, చాందిని, సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వందల్లో వినతులు

- పరిష్కరిస్తారన్న ఆశతో అర్జీలు అందజేత
- వలు సమస్యలపై వినతుల వెల్లువ

పార్వతీపురం రూరల్:

కలెక్టర్ కార్యాలయానికి సోమవారం వందల సంఖ్యల్లో ఫిర్యాదుదారులు అర్జీలు ఇచ్చేందుకు తరలివచ్చారు. వివిధ సమస్యలపై అర్జీల ద్వారా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డికి, జిల్లా ఉన్నతాధికారులకు వినతులను అందజేశారు. ప్రధానంగా రెవెన్యూకు సంబంధించి భూమి సమస్యలు, పింఛన్ మంజూరు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యుత్ ఉద్యోగుల, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం చేయాలని, మరికొన్ని ప్రధాన సమస్యలపై అర్జీలను అందజేశారు. సాలూరు కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు డెక్కత అప్పారావు రెడ్డి కుమార్తె డెక్కత రోజారమణి తన తల్లిదండ్రులు మరణించిన అనంతరం ఒంటరిగా జీవిస్తున్న నేపథ్యంలో తనకు పింఛన్‌ను మంజూరు చేయాలని, అలాగే గతంలో అధికారులు వాగ్దానం చేసి ఉత్తర్వులు ఇచ్చిన మేరకు ఇంటి స్థలం మంజూరు చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా నేటికి పరిష్కారం కాలేదని, ఇప్పటికైనా పరిష్కారం చూపాలని కోరారు. బలిజిపేట మండలం అంపావల్లి గ్రామంలో వాస్తవానికి పేదలైన గిరిజన కుటుంబాలకు కాకుండా ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలకు, స్థానిక కూటమి నాయకుల అనుచరులకు స్థలాలు కేటాయిస్తూ అర్హులైన వారికి స్థలాలు దక్కకుండా చేస్తున్నారని గ్రామస్తులు విన్నవించారు. రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంతకు ముందు వీరు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో వెంకంపేట పంచాయతీ వసుంధరనగర్‌లో కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. సాలూరు మండలం గుర్రపువలసలో చిల్లంగి నెపంతో స్థానికులు తనను వేధిస్తున్నట్టు పాలక సన్యాసిరావు విన్నవించారు. రావికోన పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఖర్చు చేసిన నిధులు సక్రమంగా జరగలేదని గిరిజనుడైన సర్పంచ రామస్వామిని వేధిస్తున్నారని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు తెలిపారు. చెక్ పవర్‌ను కూడా రద్దు చేశారని విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు, సాంబమూర్తి ఆధ్వర్యంలో సర్పంచ్ వినతిపత్రం అందజేశారు. నిండు గర్భిణి అయిన తన భార్యను పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవ నిమిత్తం ఇటీవల తీసుకువెళ్లగా సరిగా వైద్యం అందజేయకపోవడం వల్ల మృతి చెందిందని తంపటాపల్లి గ్రామానికి చెందిన బొమ్మాళి రవికుమార్ ఫిర్యాదు చేశారు. నా భార్య మృతితో తనతో పాటు ఇద్దలు పిల్లలు అనాథలుగా మారామని న్యాయం చేయాలని కోరారు. బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలు రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి, కె.రామస్వామి వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీగా వచ్చిన ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు



వసుంధరానగర్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్న స్థానికులు

రణభేరికి తరలిరండి

సీతానగరం: విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25వ తేదీన గుంటూరులో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్వహించనున్న రణభేరి బహిరంగ సభకు మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లె శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 16 నెలల సమయం గడిచినప్పటికీ ఉద్యోగ ,ఉపాధ్యాయుల సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నట్టు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో భాగంగా పెండింగ్ ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పెండింగ్ డీఏలను చెల్లించాలని, ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి పూర్తిగా విముక్తి కల్పించి బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

పని గంటల పెంపు అన్యాయం

పార్వతీపురం రూరల్: కార్మికుల హక్కులు కాలరాస్తున్న కూటమి ప్రభుత్వ పని గంటల పెంపు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, నల్లబాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పనికి విశ్రాంతి, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యతను సూచించే 8గంటల పని, 8గంటల విశ్రాంతి, 8గంటల నిద్ర అనే నినాదం కార్మికుల హక్కుల పోరాటంలో ఒక ముఖ్యమైన భాగంగా ప్రపంచ వ్యాప్తంగా చేసిన అనేక పోరాటాల ఫలితంగా 20వ శతాబ్ధం ప్రారంభం నాటికే అనేక దేశాలు 8గంటల పనిదినాన్ని చట్టబద్ధం చేశాయని వారు తెలిపారు. దీనికి విరుద్ధంగా రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం మాత్రం పాతకాలపు విధానాలను తీసుకొని రావడం దారుణమన్నారు. దీంతో కార్మికులకు అన్ని విధాలా తీవ్రంగా ఒత్తిడి చేసే ప్రమాదం ఉందన్నారు. అలా అయితే కార్మికులు తమ కుటుంబాలతో గడపడానికి సమయం కుదరక వ్యక్తిగత, సామాజిక జీవితం దెబ్బతింటుందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు కార్మిక, ఉద్యోగ సంఘాలు ఏకమై చేపడతామన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పద్మాపురంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ బి.ప్రమీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాచిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్ర, స్థానిక సర్పంచ్ బి.వీరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు



పార్వతీపురం టౌన్: వైకేఎం కాలనీలో బాలా త్రిపుర సుందరి అవతారంలో బంగారమ్మ తల్లి



పార్వతీపురం టౌన్: బాలా త్రిపుర సుందరి అవతారంలో ఇప్పల పోలమ్మ



బలిజిపేట: అజ్జాడలో ఏర్పాటుచేసిన అమ్మవారు



సీతానగరం : నిడగల్లులో కొలువైన అమ్మవారు



సాలూరు: పంచముఖేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



సాలూరు: కామాక్షమ్మ ఆలయం వద్ద జరుగుతున్న సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



సాలూరు: దుర్గాదేవిని దర్శించుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మక్కువ: శంబర పోలమాంబ ఆలయంలో అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఎక్కడికక్కడ నెలకొల్పారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలతో అలరించనున్నాయి. మరోవైపు భవానీ భక్తులు పలుచోట్ల మాలాధారణ చేశారు. నవరాత్రి ఉత్సవాలను వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. తొలి రోజు సోమవారం అమ్మవారు భక్తులకు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్

గోముఖి రెగ్యులేటర్ ద్వారా నీరు విడుదల



వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ గోముఖి రెగ్యులేటర్ ద్వారా సోమవారం ఇరిగేషన్ అధికారులు గోముఖి నదిలోకి నీటిని విడిచిపెట్టారు. ప్రాజెక్ట్‌లోకి నదుల ద్వారా ఇన్‌ఫ్లో చేరడంతో, ముందస్తుగా గోముఖి నదిలోకి 300 క్యూసెక్కులు, సువర్ణముఖి నదిలోకి 400 క్యూసెక్కులు నీటిని విడిచిపెట్టినట్లు వీఆర్ఎస్ జేఈ రాజశేఖర్ తెలిపారు. నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు రాకపోకలు సాగించవద్దని ఆయన కోరారు. – మక్కువ

మరుగుదొడ్ల నిర్మాణంపై రగడ

- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ దండి ఏడుకొండలు

పాచిపెంట: మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న ప్రజా మరుగుదొడ్లుపై ఆక్రమణలో చెరువులు శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితం కావడంతో స్థానికులు స్పందించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో స్థానిక ఎంపీటీసీ దండి ఏడుకొండలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా మరుగుదొడ్లు ప్రజా వినియోగానికి అనుకూలంగా నిర్మాణం చేపట్టాలని, అలా కాకుండా చెరువు గర్భాల్లో, బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. చెరువు గర్భంలో నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్‌లో చెరువుకు వరద నీరు ఎక్కువగా వస్తే ఆ నీటిలో కలిసిపోతాయన్నారు. బైపాస్ రోడ్డు పక్కన నిర్మాణం చేపడుతున్న మరుగుదొడ్లు రోడ్డు విస్తరణ పనులు చేపడితే వాటిని తొలగించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తద్వారా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. ప్రజలకు అనువైన చోట నిర్మాణాలు చేపట్టాలన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఊర చెరువు ఆక్రమణలకు గురవుతుందని సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెరువును పరిరక్షించాలని ఆయన కోరారు.

నిరుద్యోగ గిరిజనుల అరెస్టు అమానుషం



విలేకర్లతో మాట్లాడుతున్న మెగా డీఎస్సీ అభ్యర్థులు

సాలూరు రూరల్: మెగా డీఎస్సీ నిరుద్యోగ గిరిజనులు తమ మొర వినిపించేందుకు గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి వద్దకు వెళ్తే వారిని అరెస్టు చేయడం అమానుషమని మండలం మెట్టవలస గ్రామానికి చెందిన మెగా డీఎస్సీ అభ్యర్థులు మర్రి సుజాత, కె.సతీష్, జేఏసీ మండల అధ్యక్షుడు నిమ్మక అన్నారావు పేర్కొన్నారు. వీరంతా విలేకరులతో సోమవారం మాట్లాడారు. జీవో నంబర్ 3, డీఎస్సీ 25పై తమకు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజనులు మొరపెట్టుకొనేందుకు వెళ్తే.. పోలీసులతో అరెస్టులు చేయించిన గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి తీరు మార్చుకోవాలన్నారు. ఒక గిరిజన మంత్రి అయి ఉండి గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించాల్సింది పోయి గిరిజన నిరుద్యోగులను నిర్లక్ష్యంగా చూశారని ఆరోపించారు. ఇలాగే మంత్రి వ్యవహార శైలి ఉంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు.

కూటమి పాలనను నిరసిస్తూ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ శ్రేణులు

సీతానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు, ఐద్వా జిల్లా కార్యదర్శి రామలక్ష్మి మాట్లాడుతూ ఎనిమిది గంటల పని దినాలను కూటమి ప్రభుత్వం 13 గంటలకు పొడిగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను రద్దు చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. హక్కుల కోసం పోరాటం చేస్తున్న వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ చట్టాలను అమల్లోకి తేవడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.సునీత, ఆర్.సింహాచలం, ఎ.లక్ష్మి, జె.గౌరు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రహదారులపై ప్రయాణమెలా..!



సాలూరు రూరల్: రాళ్లు తేలిన కొదమ రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని కొదమ, చింతామల గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా రాళ్లు తేలి కనీసం నడిచేందుకు కూడా వీలుగా లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతునానరు. చింతామల, కొదమ గ్రామస్తులు చందాలు వేసుకొని రహదారి కొంతమేర వేసుకున్నారు. అయితే ఆ రహదారి కూడా రాళ్లు తేలి పూర్తి ఇబ్బందికరంగా మారిందని గిరిజనులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే రోడ్లు మరమ్మతులు చేస్తామని చెప్పి నేటికీ పట్టించుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా..

పాచిపెంట: మండలంలోని పద్మాపురం జంక్షన్ నుంచి కుంతాముకు వెళ్లే 5 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు కంకర తేలి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ రహదారి మీదుగా మూడు పంచాయతీలకు చెందిన సుమారు 20 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి అధ్వానంగా తయారవ్వడంతో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగించక తప్పడం లేదు.